## క్లుప్తంగా

### రేపు పెడనలో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

**పెడన:** వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వాసవి ప్రార్థన మందిరంలో జరుగుతుందని ఆ పార్టీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ అనే అంశంపై సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య(నాని), కృష్ణా జిల్లా పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు జెట్టి గురున్నాథంలతో పాటు ఆయా నియోజకవర్గాలకు చెందిన ఇన్‌చార్జులు పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), కైలే అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్, దేవభక్తుని చక్రవర్తి హాజరవుతారని తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

**గూడూరు:** మండల పరిధిలోని 33 కేవీ విద్యుత్ లైన్ల నిర్వహణ చేయనుండటంతో శనివారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా మల్లవోలు, ముత్రాసిపాలెం, పోలవరం, రామన్నపేట, ఐదుగుళ్లపల్లి, రాయవరం గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

**కృత్తివెన్ను:** కృత్తివెన్ను, లక్ష్మీపురం విద్యుత్‌సబ్‌స్టేషన్‌ల పరిధిలో 33కేవీ కృత్తివెన్ను ఫీడర్‌కు మరమ్మతులు జరగనుండటంతో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి ఉదయం 11 గంటల వరకు కృత్తివెన్ను, లక్ష్మీపురం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

**మచిలీపట్నంటౌన్:** నగరంలోని ఈడేపల్లి, రుస్తుంబాద, బస్టాండ్ వెనక ప్రాంతం, ఇనగుదురుపేట, చింతగుంటపాలెం, వర్రేగూడెం, దేశాయిపేట, నూరుద్దీన్ పేట ప్రాంతాల్లో శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

### వారి అభివృద్ధికి సహకరించండి

**వేములపల్లి(ఘంటసాల):** బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న మార్గదర్శకులు ఆయా కుటుంబాలు అభివృద్ధి చెందే వరకు సహకారం అందించాలని ఎంపీడీవో డి.సుబ్బారావు అన్నారు. ఘంటసాల మండలం వేములపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 22 బంగారు కుటుంబాలను ఎంపిక చేయగా వారిని ముగ్గురు మార్గదర్శకులు దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా వేములపల్లిలో శుక్రవారం సమావేశం జరిగింది. అనంతరం మార్గదర్శకులు సూర్యదేవర సాంబశివరావును ఎంపీడీవో సుబ్బారావు, తహసీల్దార్ బి.విజయప్రసాద్ శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో 2 ఎండీ మోమిన్, ఆర్ఐ కె.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఆర్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### రాజీ మార్గం ఉత్తమమైనది

**బంటుమిల్లి:** కక్షిదారులు ఆర్థిక ఇబ్బందులు పడకుండా కేసుల సత్వర పరిష్కారానికి రాజీ మార్గం ఉత్తమమైనదని బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎం. భాస్కరరావు అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులకు, కక్షిదారులకు మీడియేషన్ విధానంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ కోర్టులో నమోదైన తర్వాత 90 రోజుల్లో కక్షిదారులు ఇరు వర్గాలు రాజీ చేసుకుని సమస్య పరిష్కారం చేసుకుంటే విలువైన సమయం, ఆర్థికంగా మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై. శ్యాంబాబు, కె. నాగాంజనేయులు, సీనియర్ న్యాయవాదులు రాంబాబు, కుటుంబశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిభకు పదును పెట్టాలి

**చల్లపల్లి:** విద్యార్థులు ప్రతిభకు పదునుపెట్టి సాంకేతిక రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. స్థానిక విజయక్రాంతి కళాశాలలో శుక్రవారం 'ఫ్రెషర్స్ డే' వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పిల్లలు విద్యకే పరిమితం కాకుండా అత్యుత్తమ ప్రతిభ, కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. ఎస్వీఎల్ క్రాంతి విద్యాసంస్థల చైర్మన్ దుట్టా ఉమామహేశ్వరరావు, విజయక్రాంతి కళాశాల ప్రిన్సిపాల్ దుట్టా శివరామప్రసాద్‌లు మండలి బుద్ధప్రసాద్‌కు శాలువా కప్పి, వివేకానందుడి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, ఎంపీపీ కోట విజయరాధిక, సీఐ కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### టీబీపై జాగ్రత్తలు తీసుకోవాలి

**మచిలీపట్నం అర్బన్:** టీబీపై జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా లెప్రసీ, ట్యూబర్కిలోసిస్ అధికారి డాక్టర్ ఎ.వెంకటరావు సూచించారు. ట్యూబర్కిలోసిస్ (టీబీ) ముక్త్ భారత అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీపీఎం మధుసూధనరావు, విజయగౌరి, టీబీ హెచ్వీ కేవీవీ ప్రసాద్ బాబు, కేవీఎస్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు పచ్చి మోసగాడు



హాజరైన నాయకులు, కార్యకర్తలు



అవనిగడ్డలో జరిగిన 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ'లో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని, చిత్రంలో సింహాద్రి రమేష్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, కైలే అనిల్‌కుమార్ తదితరులు

**జనాలకు చెప్పండి**

- కూటమి పాలనలో సమస్యలతో సతమతం
- ఉచిత బస్సు పథకంతో ఐదు కిలోమీటర్లు కూడా వెళ్లలేరు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని
- అవనిగడ్డలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ

**అవనిగడ్డ:** కూటమి పాలనలో నిత్యం సమస్యలతో సతమతవుతున్న ప్రజలు చంద్రబాబు ఇచ్చిన హామీలను మర్చిపోయారని, ఆయన ఎంత పచ్చి మోసగాడో జనాలకు చెప్పాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయ ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని 2015 నుంచి నిషేధిత జాబితా(చుక్కల భూమి)లో ఉన్న భూములకు నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విముక్తి కలిగించారన్నారు. దీనికోసం సింహాద్రి రమేష్ బాబు ఎంతో కష్ట పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మళ్లీ చుక్కలు భూములుగా మార్చారని చెప్పారు. రైతుల వద్దకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంక ఎవరూ చుక్క పెట్టకుండా వేసిన తాళాలు బద్దలు కొడతారని దమ్ముగా చెప్పాలన్నారు.

**ప్రశ్నిస్తానన్న పవన్‌కళ్యాణ్ ఫ్లైట్లలో తిరుగుతున్నారు**

ప్రశ్నిస్తానన్న సీఎం పవన్‌కల్యాణ్ పాలన గాలికొదిలేసి ఫ్లైట్లలో తిరుగుతున్నాడని నాని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు ఏ కష్టం వచ్చినా జగన్ చెల్లి షర్మిళ, పవన్ కళ్యాణ్ బయటకొస్తారని లేదంటే వారు కనబడరని పేర్ని నాని అన్నారు.

**లోకేష్‌ను రుద్దేయాలని చంద్రబాబు చూస్తున్నారు**

సీఎం చంద్రబాబు లోకేష్‌బాబుని ప్రజలపై రుద్దేయాలని చూస్తున్నారని, తల్లికి వందనం లోకేష్ ఆలోచనలో నుంచి పుట్టిన గొప్ప పథకమని నిస్సిగ్గుగా అబద్ధాలు ఆడారన్నారు. ఉచిత బస్సు పథకాన్ని జిల్లాలకే పరిమితం చేసి మహిళలను మోసం చేశారని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. ఐదు కిలో మీటర్లు కూడా ఉచిత బస్సులో వెళ్ళలేరని నాని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎంత బాగా పాలన చేశారో, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఏ విధంగా మోసం చేస్తున్నారో ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాలని పేర్ని పిలుపు నిచ్చారు.

**బాండ్లలో చెప్పిన బాకీలు ఎప్పుడు తీరుస్తారో**

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ బాండ్లలో ఇచ్చిన బాకీలు ఎప్పుడు తీరుస్తారో అని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక చెప్పారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పనులు ప్రారంభించిన అవనిగడ్డ – కోడూరు రోడ్డుని పర్సంటేజీల కోసం ఏడాది పాటు పనులు ఆపించిన ఘనత బుద్ధప్రసాద్‌కే దక్కిందన్నారు. పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల మచిలీపట్నంలో పర్యటించిన లోకేష్ ఐఏఎస్, ఐపీఎస్, జిల్లా అధికారులను వాడు, వీడు అంటూ సంబోధించడం ఎంతవరకూ సమంజశమన్నారు.పెనమలూరు నియోజకవర్గ సమన్వయ కర్త దేవభక్తుని చక్రవర్తి మాట్లాడుతూ తల్లికి వందనం ఎవరికి పడిందో తెలియని పరిస్థితి ఉందని చెప్పారు. పార్టీ 'మచిలీపట్నం' పరిశీలకుడు గురునాథం మాట్లాడుతూ అన్ని వర్గాలను చంద్రబాబు మోసం చేశాడన్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో పార్టీ యువనేత సింహాద్రి వికాస్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాశీ, గుడివాడ పార్టీ నేత శశిభూషణ్, పార్టీ రాష్ట్ర బూత్ కమిటీ అధ్యక్షుడు దోవారి పూర్ణసాగర్, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్, అవనిగడ్డ, ఘంటసాల, కోడూరు, చల్లపల్లి జెడ్పీటీసీలు లక్ష్మీనారాయణ, మురళి, సత్యనారాయణ, కళ్యాణి, ఎంపీపీలు తుంగల సుమతీదేవి, వేమూరి రజనీకుమారి, పంచాయితీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండల అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, పరిశె మాధవరావు, భోగాది శేషగిరిరావు, గొరికపాటి వెంకటేశ్వరరావు, శీలి వెంకట సత్యనారాయణ, వేమూరి వెంకట్రావ్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు తలదించుకునేలా కూటమి పాలన

**మచిలీపట్నం మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ**



మాట్లాడుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ చిత్రంలో డెప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు

**మచిలీపట్నంటౌన్:** రాష్ట్రంలో మహిళలు తలదించుకునేలా కూటమి పాలన సాగుతోందని మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో 50 మంది పారా మెడికల్ విద్యార్థినులు వైద్య పరీక్షలు చేయించుకున్న సందర్భంలో వారి శరీర భాగాలను ఫొటోలు తీశారన్నారు. వాటిని విద్యార్థినులకు పంపి బ్లాక్ మెయిల్ చేస్తూ వారి పరీక్షల్లో ఫెయిల్ చేస్తామని లైంగికంగా వేధిస్తున్న ల్యాబ్ అటెండెంట్ కళ్యాణ్ చక్రవర్తి, మరో నలుగురు అసిస్టెంట్లు చేసిన దారుణ ఘటనపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని కూటమి ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్లో డిప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ మాజీ డిప్యూటీ మేయర్ తంటిపూడి కవిత మహిళా కార్పొరేటర్లతో కలసి ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ ఘటనపై సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనిత ఇప్పటివరకు పెదవి ఇవ్వకపోవడం ఎంతవరకు సబబు అని ఆమె ప్రశ్నించారు.

## కౌన్సిల్ సమావేశం వాయిదా

**మచిలీపట్నంటౌన్:** మచిలీపట్నం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొర్రా సుధాకర్ మృతికి శుక్రవారం జరిగిన నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం నివాళులు అర్పించింది. అధికార వైఎస్సార్ సీపీ, ప్రతిపక్ష టీడీపీ సభ్యులు సుధాకర్ మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ 2000–05 సంవత్సరాల మధ్య సుధాకర్ కౌన్సిలర్‌గా పని చేశాడన్నారు. ఆ కాలంలో తాను ప్రాతినిధ్యం వహించిన వార్డు అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. సుధాకర్ మృతికి సంతాపంగా కౌన్సిల్ రెండు నిమిషాలు మౌనం పాటించాలని ఆమె కోరడంతో సభ్యులందరూ నిలబడి మౌనం పాటించి నివాళులర్పించారు. డెప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మాజీ డిప్యూటీ మేయర్ లంక సూరిబాబు, కార్పొరేటర్లు మీర్ అస్గర్ అలీ, ఎంద్రపాటి నాగేశ్వరరావు, పరింకాయల విజయ్, టీడీపీ సభ్యులు సమతా కీర్తి, రాళ్ల కొట్టు రాము, దేవరపల్లి అనిత, ఆనంద్ సుధాకర్ నివాళులర్పించారు. అనంతరం సమావేశాన్ని మేయర్ వెంకటేశ్వరమ్మ వాయిదా వేశారు.

## అడ్డొస్తే తొక్కించేస్తామంటున్న మట్టి మాఫియా

**నందిగామ సర్పంచి చినబాబు, తమ్ముళ్లు**

**పెడన:** అడ్డొస్తే తొక్కించేస్తామని మట్టి మాఫియా బెదిరిస్తోందని, పార్టీ కోసం కష్టపడుతున్న తమను అవమానించేలా పెడన నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మండల పార్టీ నాయకులు నడుచుకుంటున్నారంటూ నందిగామ గ్రామ దళిత సర్పంచి, టీడీపీ సీనియర్ కార్యకర్త బొడ్డు చినబాబు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన గ్రామ సచివాలయంలోని తన చాంబరులో విలేకర్లతో మాట్లాడారు. నందిగామ గ్రామం మీదుగా మట్టి తోలకం అధికమైందని, చాలా రోజులు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా తోలుకుంటున్నారని పేర్కొన్నారు. గురువారం రాత్రి కూడా లారీలు వెళ్తుంటే వాటిని ఆపి నినాదనంగా వెళ్లాలని సూచించామన్నారు. లారీ డ్రైవర్లు ఎదురుతిరిగి దాడికి దిగడానికి సిద్ధమయ్యారన్నారు. అధికారులకు. లారీలు రాకపోకలతో గ్రామంలోని పైపులైన్లు దెబ్బతింటున్నాయని అంటే మండల పార్టీ అధ్యక్షుడు శెలపాటి ప్రసాద్ సర్పంచుకు ఏం సంబంధం కాంట్రాక్టరు చూసుకుంటాడని పేర్కొవడం ఏమిటంటూ ప్రశ్నించారు. జనసేన నాయకుడు రాజులపాటి సత్యనారాయణ మాట్లాడుతూ రోడ్డు పక్కనే నా సోదరుడి ఇల్లుందని, లారీలను ఆపితే ఆపేది ఎవడ్రా అంటూ తొక్కించేస్తామంటూ దాడికి దిగుతున్నారంటూ పేర్కొన్నారు. గత పాలనలోనే పెడన నియోజకవర్గం బాగుందని, ఇప్పుడు మరింత పాడు చేస్తున్నారంటూ చినబాబు పేర్కొవడం గమనార్హం. సమావేశంలో నందిగామ పాల కేంద్రం అధ్యక్షుడు జన్ను సీతయ్య, పామర్తి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో యూరియా

**పెడన:** యూరియా రైతులకు అందుబాటులో ఉందని వ్యవసాయశాఖ ఏవో ఎస్.జెన్నీ అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని నందమూరు పీఏసీఎస్‌ను సందర్శించి ఎరువుల స్టాక్ రిజిస్టర్లను, నిల్వలను పరిశీలించారు. ఎంతకు విక్రయిస్తోంది తదితర వివరాలను పీఏసీఎస్ కార్యదర్శి మోహనరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెన్నీ మాట్లాడుతూ అన్ని పీఏసీఎస్‌లలో యూరియా అందుబాటులో ఉందని, రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

## వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

**పెడన:** వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం పెడన నియోజకవర్గంలోని పెడన పట్టణం, పెడన మండలంతో పాటు బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు మండలాల పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుల పేర్లను వెల్లడించింది. ఈ మేరకు గురువారం రాత్రి కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

**బంటుమిల్లి మండలంలో..**

ముక్కోలు మురళి (యూత్ వింగ్), పాము పుష్ప (మహిళా విభాగం), సుగుణం జనార్ధనరావు (రైతు విభాగం), జొన్నలగడ్డ పాండురంగారావు (బీసీ సెల్), మద్దాల నరేష్ (ఎస్సీ సెల్), గంధం వజ్రయ్య (ఎస్టీ సెల్), ఎండీ సూరజ్‌బాషా (మైనార్టీ సెల్), కోడూరు వెంకటేశ్వరరావు (క్రిస్టియన్ మైనార్టీ సెల్), కొల్ల శ్రీధర్(స్టూడెంట్ వింగ్), దొడ్డాక సాయిబాబు(వలంటీర్స్ వింగ్), వూర బలరామ్(వాణిజ్య విభాగం), షేక్ బాజీ(వైఎస్సార్‌టీయూసీ), చింటూ(సోషల్ మీడియావింగ్), గౌరీ శ్రీనివాసరావు(బూత్‌కమిటీ వింగ్), రాయపురెడ్డి వీరకుంటుంబరావు(పబ్లిక్ వింగ్)లను ఆయా విభాగాలకు మండల అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

**గూడూరు మండలంలో..**

జక్కా రాజేష్(యూత్‌వింగ్), కంచర్లపల్లి మాధవి(మహిళా విభాగం), దాసరి రమేష్(రైతు విభాగం), చింతల శ్రీనివాస్(బీసీ సెల్), కనపర్తి శ్రీనివాస్(ఎస్సీ సెల్), ఎండీ కరీముల్లా(మైనార్టీ సెల్), మెండు రమేష్(క్రిస్టియన్ మైనార్టీ సెల్), జంపాన అవినాష్(స్టూడెంట్ వింగ్), జిన్నాబత్తుని వెంకటేశ్వరరావు(పంచాయతీరాజ్ వింగ్), పేరిశెట్టి మధుసూదనరావు(వీవర్స్ వింగ్), ఓలేటి వెంకటేశ్వరరావు(వైఎస్సార్ టీయూసీ), బొమ్ము ఆదిత్యసాయి వెంకట్(సోషల్ మీడియా వింగ్), చింతల శ్రీనివాస్(బూత్‌కమిటీ వింగ్), లుక్కా ఏలేష్(పబ్లిసిటి వింగ్)లను అధ్యక్షులుగా నియమించారు.



**మచిలీపట్నంలో...**

**చిలకలపూడి(మచిలీపట్నం):** మచిలీపట్నం నార్త్, సౌత్ మండలాల్లో అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మచిలీపట్నం నార్త్ మండలం యూత్ వింగ్ అధ్యక్షుడిగా జొన్నల నాగరాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా మద్దెల పాండురంగారావు, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా పిప్పళ్ల నాగేంద్ర ప్రసాద్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా జల్లూరి నాగవెంకటలీలాకృష్ణ, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా ప్రత్తి పవన్, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షునిగా పరింకాయల అశోక్‌లను నియమించారు. మచిలీపట్నం సౌత్ మండల సోషల్ మీడియా వింగ్ అధ్యక్షునిగా రెడ్రౌతు అప్పుచందు, డాక్టర్స్ వింగ్ అధ్యక్షునిగా డొక్కా వీరవెంకట అంకినీడు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా కోరేపల్లి రమేష్‌ను నియమించారు.

**కృత్తివెన్ను మండలం..**

పుప్పాల సాంబశివరావు– పండు(యూత్ వింగ్), జన్యావుల ఝాన్సీ(మహిళా విభాగం), కూనసాని వెంకట సుగుణకుమార్(రైతు విభాగం), చెన్నూ దుర్గారావు(బీసీ సెల్), ఈదా కిషోర్(ఎస్సీ సెల్), గంధం నాగరాజు(ఎస్టీ సెల్), మౌలాలి అహ్మద్(మైనార్టీ సెల్), నల్లగంగుల సాల్మన్‌రాజు(క్రిస్టియన్ మైనార్టీ సెల్), తిరుమలశెట్టి దుర్గాప్రసాద్(స్టూడెంట్ వింగ్), పట్టపు శ్రీనివాసరావు(పంచాయతీరాజ్ వింగ్), నల్లగంచు వెంకన్నబాబు(వలంటీర్స్ వింగ్), పొన్నమల నాగరాజు(వాణిజ్య విభాగం), గూడవల్లి వెంకన్న(వైఎస్సార్ టీయూసీ), తిరుమాని ఉమామహేశ్వరరావు(సోషల్ మీడియా వింగ్), వైధాని సుబ్బరాజు(దివ్యాంగుల విభాగం), యాళ్ల దాసు(బూత్ కమిటీ విభాగం), షేక్ సాహెనాబ్ బేగం(పబ్లిసిటి వింగ్)లను అధ్యక్షులుగా నియమించారు.

**పెడన మండలం..**

పరసా రాజేష్(యూత్ వింగ్), చిల్లిముంత వెంకటేశ్వరమ్మ(మహిళా విభాగం), కాగిత వెంకటేశ్వరావు(రైతు విభాగం), బొల్లా నాగ ఉదయకుమార్(బీసీ సెల్), పుట్టి వెంకటేశ్వరరావు ఉరఫ్ గణేష్(ఎస్సీ సెల్), మెరుగు నాగార్జున(క్రిస్టియన్ మైనార్టీ సెల్), మురాల అనిల్(స్టూడెంట్ వింగ్), వూసా అనిల్(పంచాయతీ రాజ్ వింగ్), యర్రంశెట్టి పార్వతీ(అంగన్‌వాడీ వింగ్), ఆత్మూరి రామకృష్ణ(సోషల్ మీడియా వింగ్), రక్కిసు వెంకటరామయ్య( సోషల్ మీడియా వింగ్), పామర్తి బెనర్జీ(బూత్ కమిటీ వింగ్), రాజులపాటి నాగమల్లేశ్వరరావు(వాలంటీర్స్ వింగ్), యర్రంశెట్టి తాతయ్య(వైఎస్సార్‌టీయూసీ)లను అధ్యక్షులుగా నియమించారు.

**పెడన పట్టణంలో...**

సలీం(యూత్ వింగ్), వన్నం శ్రీలత(మహిళా విభాగం), వరుదు నేతాజీ(రైతు విభాగం), కారుపర్తి రామచంద్రరావు(బీసీ సెల్), మల్ల కొండ(ఎస్సీ సెల్), అబ్దుల్ కలాం(మైనార్టీ సెల్), దాసి రామచంద్రరావు(క్రిస్టియన్ మైనార్టీ సెల్), వీరంకి చందు(స్టూడెంట్‌వింగ్), తోట ఆనంద్‌కిషోర్(మున్సిపల్ వింగ్), సిరిగిరి విజయ్(వాలంటీర్స్ వింగ్), జల్లూరి శరత్‌బాబు(వాణిజ్య విభాగం), వూట్ల ఓంకారం(వీవర్స్ వింగ్), కంచడం శివ(సోషల్ మీడియా వింగ్), పీవీకేవీ నాగేశ్వరరావు(డాక్టర్స్ వింగ్), కారుపర్తి హరిశ్రీరామ చంద్రమూర్తి(బూత్ కమిటీ వింగ్), లంకె స్రవంతి(పబ్లిసిటీ వింగ్)లను అధ్యక్షులుగా నియమించారు.

## అధిక జనాభా అనారోగ్య కారకం



పెదతుమ్మిడి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ర్యాలీ

**బంటుమిల్లి:** దేశంలో అధిక జనాభా కారణంగా ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని బంటుమిల్లి, పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కె.పవన్‌కుమార్, కె.సువర్చల అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీల్లో శుక్రవారం అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా నియంత్రణకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన సూచనలు పాటిస్తే ప్రతి కుటుంబానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలసి వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో వైద్యులు జయశ్రీ, సౌందర్య, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

**జనాభా పెరుగుదలపై పర్యావరణం**

దేశంలో జనాభా పెరుగుదల ప్రభావం పర్యావరణంపై పడి వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. జగన్‌మోహన్‌రావు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అవగాహన సమావేశం నిర్వహించారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**గూడూరు:** ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి తరుణ శంకర మాట్లాడుతూ కాన్పుకు కాన్పుకు కనీసం మూడేళ్ల ఎడం పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వీరయ్య, తాతబ్బాయి, హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

**ఘంటసాల:** ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా సిబ్బందితో కలసి పీహెచ్‌సీ డాక్టర్ వేమూరి ప్రమోద్‌కుమార్ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్లు శివకృష్ణ, పూర్ణచంద్రరావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో 'సారె' సందడి



మహిళలతో సారెను తీసుకెళ్తున్న డెప్యూటీ మేయర్ శీలం భారతి



అన్నపూర్ణాదేవికి ఊరేగింపుతో ఆషాఢ సారె తీసుకొస్తున్న భక్తులు



నీలిపూడిలో శాకంబరిగా దుర్గాదేవి

**భావదేవరపల్లి(నాగాయలంక):** ఆషాఢ మాసం పురస్కరించుకుని భావదేవరపల్లి శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆషాఢ సారె వేడుక పూజ ఘనంగా నిర్వహించారు. గొడవర్తి లీలాశివకుమార్,సుధాపూర్ణ, ఆలయ అమ్మవారి విగ్రహదాతలైన అర్జా ఉదయ భాస్కరరావు, నాగలక్ష్మి దంపతుల సౌజన్యంతో ఆషాఢ సారె అందజేశారు. తొలుత ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివ సత్యవతి మహిళలకు సాదర స్వాగతం పలికారు. అన్నపూర్ణాదేవికి భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు.

**నేడు కన్యకా పరమేశ్వరి ఆలయంలో సారె సమర్పణ**

**నాగాయలంక:** మండల ఆర్యవైశ్య సంఘం, శ్రీవాసవీ సేవాదళ్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక పార్వతీసమేత కన్యకా పరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష ఆషాఢ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు శుక్రవారం తెలిపారు.

**కృత్తివెన్ను:** నీలిపూడిలో శ్రీ కనకదుర్గమ్మకు స్థానిక మహిళా భక్తులు ఆషాఢ సారెను సమర్పించారు. శుక్రవారం గ్రామంలోని మహిళలంతా కలసి పసుపు, కుంకుమ, పండ్లు, నూతన వస్త్రాలతో పాటు వివిధ రకాల స్వీట్లు, చలిమిడిని తీసుకుని గ్రామంలో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. అమ్మవారిని ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరిదేవిగా అలంకరించారు.

**మచిలీపట్నంటౌన్:** బందరు మూడో డివిజన్‌లో గంగానమ్మ ఆలయంలో డెప్యూటీ మేయర్ శీలం భారతి, ఆ డివిజన్ మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జి దంపతులు ఆషాఢ మాస సారెను శుక్రవారం అందజేశారు. గంగానమ్మ శాకాంబరీ దేవిగా దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది.

**శాకంబరిగా ముత్యాలమ్మ**

**పెడన:** పట్టణంలో గ్రామ దేవత పైడమ్మవారు శాకంబరి దేవిగా దర్శనమిచ్చారు. శుక్రవారం వేకువ జాము నుంచి శాకంబరిదేవి అలంకరణలో ఉన్న పైడమ్మను దర్శించుకునేందుకు ఆలయం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పాతపేటలోని ముత్యాలమ్మ ఘటం గుడిలోని ముత్యాలమ్మకు పాతపేటలోని మహిళా భక్తులు కొందరు ఆషాఢ సారెను సమర్పించారు.

## దాతల సహకారాన్ని వినియోగించుకోవాలి



నోటు పుస్తకాలతో విద్యార్థులు

**దేవరకోట(ఘంటసాల):** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకోవాలని వక్తలు తెలిపారు. ఘంటసాల మండలం దేవరకోట గ్రామానికి చెందిన ఎన్నారై దోనేపూడి శాయిజీ ఆర్థిక సహకారంతో వారి తల్లి దోనేపూడి మునీశ్వరమ్మ జ్ఞాపకార్థం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 23 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, ఇతర విద్యా సామగ్రిని అందించారు. వీటిని దోనేపూడి నాగకృష్ణ మురళి, సుకన్య దంపతులు శుక్రవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ కొప్పుల రావులమ్మ, పంచాయతీ కార్యదర్శి సీహెచ్.కాంతారావు, హెచ్ఎం శివరాణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పాగోలు పావని తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

**కోడూరు:** ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న కోడూరుకు చెందిన బండారు మణికంఠకు టీఎ స్సార్ గ్రూప్ చైర్మన్ తిరుపతి శ్రీనివాసరావు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. మణికంఠ ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, శ్రీనివాసరావు యువకుడిని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. మణికంఠకు అండగా ఉంటానని శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు.

## గోవుల సంతానోత్పత్తికి బుల్ సెమన్‌లు

**చల్లపల్లి:** గోవుల సంతతిని అభివృద్ధి చేసేందుకు శ్రీమంతురాజా యార్లగడ్డ రామేశ్వరప్రసాద్ బహదూర్ శుక్రవారం బుల్ సెమన్(ఎద్దుల వీర్యం) వైల్స్‌ను గోపాల మిత్రలకు ఉచితంగా అందజేశారు. చల్లపల్లి రాజాగారి రెండో కుమారుడైన శ్రీమంతు రాజా యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహదూర్ ఇటీవల కాలం చేసిన విషయం తెలిసిందే. ఆయన జ్ఞాపకార్థం వారి కుమారులు రామేశ్వరప్రసాద్ బహదూర్, హరిశ్చంద్రప్రసాద్ బహదూర్‌ల ఆర్థిక సహకారంతో రూ.30వేలు విలువైన 300 బుల్ సెమన్‌లను వీరవల్లి గ్రామం నుంచి తెప్పించారు. స్థానిక రాజావారి ప్యాలెస్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి, మచిలీపట్నం, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాలకు చెందిన గోపాల మిత్రలకు రామేశ్వరప్రసాద్ చేతులమీదుగా ఈ బుల్ సెమన్‌లను పంపిణీచేశారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు, రావి రాజేశ్వరరావు(రాజు), అడపా రవి తదితరులు పాల్గొన్నారు.

**రేపు ఉచిత కంటి వైద్య శిబిరం**

**నాగాయలంక:** జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని సంస్థ నిర్వాహకుడు రఘుశేఖర్ శుక్రవారం తెలిపారు. దీన్ని వినియోగించుకోవాలన్నారు.